# షాడో ఇన్ బోర్నియో



# షాడో ఇన్ బోర్నియో

(ఎ షాడో స్పై థ్రిల్లర్)

రచన:

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

[కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.]

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# షాడో ఇన్ బోర్నియో

చెవులు చిల్లులుపడే శబ్దంతో సింటాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో దిగింది అమెరికన్ ఎయిర్ కార్పొరేషన్ వారి బోయింగ్ విమానం.

ఇద్దరే ప్రయాణికులు వున్నారు అందులో. ఎయిర్ హోస్టెస్ యిచ్చిన మాగ్‌జైన్ ముఖం మీద వేసుకుని గాఢనిద్ర అభినయిస్తున్న షాడో, మాగ్‌జైన్ చివరినించి ఓరగా చూశాడు రెండో ప్రయాణికుడివైపు.

సీటు కింద పెట్టిన బ్రీఫ్‌కేస్‌ను అందుకొని, విమానం ఆగగానే క్రిందికి దిగటానికి రెడీగా ఉన్నాడు ఆ ప్రయాణికుడు. అతని మనస్సులో ఎటువంటి సందేహము ఉన్నట్లు కన్పించటం లేదు. ముఖంలో కలవరపాటు మొదలే లేదు.

తను కూడా అదే మాదిరి ధీమాగా విమానం దిగితే ఎంత బాగుంటుందో అనుకుంటూ గాఢంగా నిట్టూర్చాడు షాడో.

బోర్నియో దీవుల్లో నివసించే పౌరులకు తప్ప మరెవ్వరికీ ఆ దేశంలోకి వచ్చేందుకు అనుమతి ఇవ్వటం లేదు బోర్నియో ప్రభుత్వం. షాడో మాదిరి మొండికేసి వచ్చిన వాళ్ళను వచ్చిన వెంటనే మరో విమానం ఎక్కించి అవతలికి తరిమేస్తోంది.

"జంటిల్మన్! విమానం ఆగింది. యిక మీరు దిగవచ్చు." స్వీట్‌గా హెచ్చరించింది ఎయిర్ హోస్టెస్.

ఉలిక్కిపాటును కప్పి పెట్టుకుంటూ లేచి నిలబడ్డాడు షాడో. ఎయిర్‌బాగ్‌ని భుజానికి తగిలించుకొని మెల్లిగా విమానం లోంచి క్రిందికి దిగాడు.

ఎప్పుడు చూసినా వచ్చే పోయే విమానాలతో విపరీతమైన రద్దీగా వుండే సింటాంగ్ ఎయిర్‌పోర్టు నిశబ్దంగా ఆల్‌మోస్ట్ నిర్మానుష్యంగా కనిపిస్తోంది.

కస్టమ్స్ కౌంటర్ దగ్గర బ్రహ్మరాక్షసుల్లా నిలబడి సీరియస్‌గా చూస్తున్నారు విమానాశ్రయపు అధికారులు.

షాడోతో పాటు వచ్చిన ప్రయాణీకుడు బోర్నియో నివాసి. వెనుకా ముందు చూసుకోకుండా సూటిగా వాళ్ళ దగ్గరకు పోయి తన పాస్‌పోర్టును చూపించాడతను. రెండు నిముషాల్లో ఫార్మాలిటీస్‌ను పూర్తి చేసుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు అవతలకి.

కదలమని మొరాయిస్తున్న పాదాల్ని అతి ప్రయత్నం మీద కదిలిస్తున్నట్లు, అతి నెమ్మదిగా అడుగులు వేస్తూ కస్టమ్స్ కౌంటర్ దగ్గరకు పోయి, తన పాస్‌పోర్టును చూపించాడు షాడో.

"ఓ! పారిస్ నుంచి వస్తున్నారన్నమాట. ఉయార్ సారీ సర్, ఫారినర్స్ ఎవర్నీ దేశంలోకి ఎలవ్ చెయ్యొద్దని మా గవర్నమెంటు ఆర్డర్స్ యిచ్చింది. మీరు వెనక్కి వెళ్ళిపోవటం కంటే మంచిపని మరొకటి లేదు."

పాస్‌పోర్టును చూసీ చూడగానే వినయంగా సగౌరవంగా, నిర్మొహమాటంగా అసలు విషయాన్ని బైటపెట్టాడు ఒక కస్టమ్స్ అధికారి.

అటువంటి మాటనే వినడానికి రెడీగా వున్నాడు షాడో. జీవం లేని చిరునవ్వును ఒకదాన్ని అతని వైపు విసిరేసి, "ఇట్సాల్ రైట్ జంటిల్మన్... నాలుగు నెలలనుంచీ నాకు గుండె జబ్బు ఒకటి తగులుకుంది. బోర్నియోలో నుంచి స్పెషలిస్టులు వున్నారని విని ఇక్కడకు వచ్చాను. మీరు కాదు పొమ్మంటే యిక చేసేదేముంది? వెనక్కు పోయి నా బాధలేవో నేనే పడతాను..." అంటూ వెనక్కి రెండు అడుగులు వేసి బాధగా నొసలు విరిచాడు.

"వాటీజ్ దట్? ఏమయింది మీకు?" అందోళనగా అడుగుతూ చటుక్కున ముందుకు అడుగు వేశాడు ఆ అధికారి.

వెంటనే గుండెను అదిమిపట్టుకొని యిసుకమూట క్రింద పడినట్లు నిట్టనిలువునా విరుచుకుపడిపోయాడు షాడో.

"మైగాడ్! డాక్టర్‌ని పిలవండి... కమాన్... క్విక్" అని మిగిలిన వారిని హెచ్చరిస్తూ అతని భుజాల్ని పట్టుకొని, అక్కడే వున్న సోఫా మీదకు లాగాడు కస్టమ్స్ అధికారి.

వింటినుంచి వెలువడిన బాణాల్లా ఎయిర్‌పోర్టు డాక్టర్లు వుండే భవనం వైపు పరుగులు తీసారు ఇద్దరు అధికారులు. మిగిలిన వాళ్ళు శిలా విగ్రహాల్లా షాడో చుట్టూ నిలబడ్డారు.

విపరీతమైన బాధతో మెలికలు తిరిగిపోతూ, కనురెప్పల చాటునుంచి వారందర్నీ జాగ్రత్తగా పరిశీలించాడు. డాక్టర్ అనే వాడు అక్కడకు వచ్చి తన గుండెమీద చెయ్యివేసిన మరుక్షణం తన బండారం బైటపడిపోతుందని అతనికి తెలుసు. వైద్యశాస్త్రంలో ఆరోగ్యవంతమైన గుండె ఎన్నిసార్లు కొట్టుకోవాలని వ్రాసివుందో, అన్నిసార్లు అతి చక్కగా కొట్టుకొంటోంది తన గుండె. కొంచెంకూడా తడబడటంలేదు. ఆ విషయాన్ని గమనించిన మరుక్షణం, అనుమతి లేకుండా వచ్చినందుకే కాక, అనవసరమైన నాటకం ఆడి అందర్నీ హడలకొట్టినందుకు రెండు రోజులు తిండి పెట్టకుండా మాడ్చి దేశంలో నుంచి తరిమి వేయగలరు వాళ్ళు... కథ అంత దూరం పోకముందే తను అక్కడ నుంచి దాటుకోవాలి.

"దాహం... దాహం... చచ్చిపోతున్నాను....దాహం" అని మూలుగుతూ కనులు తెరిచి చూశాడు షాడో.

వెంటనే అవతలికి పరుగెత్తారు మరో ఇద్దరు అధికారులు. షాడో దగ్గర వున్నది యిద్దరే యిద్దరు. వారిద్దర్నీ చెరొక గుద్దూ గుద్ది, ఎయిర్‌బాగ్‌ని భుజాన వేసుకొని బయటకు పరుగుతీస్తే---

అక్కడితో సడన్‌గా పుల్‌స్టాప్ పడింది షాడో ఆలోచనలకు.

మంచినీళ్ళ కోసం పరుగెత్తినఅధికారులు ఇద్దరూ ఉన్నట్లుండి ఆగిపోయి "గుండెనొప్పి వాళ్ళకి మంచినీళ్ళు యివ్వచ్చా!" అని అడుగుతూ వెనక్కు తిరిగారు.

గుండెజబ్బు పేషేంట్లకు మంచినీళ్ళు యివ్వచ్చో లేదో షాడో దగ్గర నిలబడివున్న అధికారులకు తెలియదు. ఆ మాట కొస్తే షాడోకి కూడా తెలియదు. ఆ విషయాన్ని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా అతనికి లేదు. ఆలోచిస్తూ అలాగే పడుకొని వుంటే అటువంటి అవకాశం మరొకటి లభించదు... వున్నట్లుండి సోఫామీదినుంచి లేచి నిలబడ్డాడతను.

"నొప్పి... గుండెనొప్పి.... చచ్చిపోతున్నాను.... ఇక ఎంతోసేపు బ్రతకను." అని అరుస్తూ క్రిందవున్న ఎయిర్‌బేగ్‌ను అందుకుని దానితో తన దగ్గిర నిలబడివున్న అధికారులిద్దర్నీ బలంగా గుండెలమీద బాదాడు.

"మైగాడ్! మోసం... దగా... మోసం." అని అరుస్తూ వేటకుక్కల్లా అతనివైపుజంప్ చేశారు నీళ్ళ కోసం బయలుదేరిన అధికారులు.

ఎడమచేతితో వారిద్దరి ముఖాలమీదా శరవేగంతో రెండు పంచస్ యిచ్చాడు షాడో. వాళ్ళు బాధగా అరుస్తూ క్రింద పడగానే, ఎయిర్‌బేగ్‌ని భుజం మీద వేసుకొని బయటివైపుపరుగు తీశాడు.

"పట్టుకోండి..అతన్ని పట్టుకోండి..." అని అరుస్తూ క్రిందినుంచి లేచి అతన్ని వెన్నంటారు కస్టమ్స్ అధికారులు.

పట్టుబడాలన్న కోరిక షాడోకి కొంచెంకూడా లేదు. గాజు గోడలతో నిర్మించబడిన కష్టమ్స్ కౌంటర్‌ని దాటి బయటకు పోగానే, చటుక్కున ప్రక్కకు తిరిగి, దూరంలో వున్న ముళ్ళపొదల వైపుదూసుకుపోయాడు.

కస్టమ్స్ అధికారుల అరుపులు ఎయిర్ పోర్టు సెక్యూరిటీ సిబ్బందిని ఎలర్ట్ చేశాయి. పెద్ద పెద్ద రైఫిల్స్ పట్టుకొని జీపుల మీద, మోటారు సైకిళ్ళమీదా షాడోని తరమటం మొదలు పెట్టారు వారందరూ.

రెండు వందల గజాల దూరం పోగానే ఎయిర్ పోర్టు సరిహద్దును సూచించే ఐరన్ ఫెన్సింగ్ షాడోకి అడ్డు వచ్చింది. నాలుగు అడుగుల ఎత్తే ఉన్నదది. అందువల్ల తేలికగానే దాని మీదినుంచి అవతలకు దూకి, దగ్గర్లో వున్న ముళ్ళ పొదల్లో దూకాడు.

ఎయిర్ పోర్టు సిబ్బంది తమ పట్టుదలను వదిలి పెట్టలేదు. తమ వాహనాల్ని ఫెన్సింగ్ దగ్గిర వదిలేసి వాళ్ళు కూడా ముళ్ళపొదల్లో అడుగు పెట్టారు.

"కమాన్... పోలీస్ కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేయండి. ఇర్విన్ కొండల దగ్గర రోడ్లన్నిటినీ బ్లాక్ చేస్తే కన్నంలో ఎలుక లాగా మన చేతికి దొరికిపోతాడు. తొందరగా పొండి" ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్స్ పాస్ చేశాడు ఒక సెక్యూరిటి ఆఫీసర్.

అతని అసిస్టెంట్లు యిద్దరు వెనుతిరిగి ఎయిర్ పోర్టు భవనాల వైపు పరుగెత్తడం ఒక పొదచాటున నిలబడిన షాడోకి కనిపించింది.

తన పొజిషన్ క్రిటికల్ స్టేజ్‌కి చేరుకొన్నదని గ్రహించటానికి ఎంతో వ్యవధి అతనికి అవసరం లేకపోయింది. తరుముకు వస్తున్న సెక్యూరిటి స్టాఫ్‌ని తప్పించుకోవాలంటే తను ఇర్విన్ కొండల దగ్గరకు పోయి తీరాలి... ఆ కొండల దగ్గర పోలీసులు మాట వేస్తే తన పని కన్నంలోని ఎలుక మాదిరిగా తయారవటం ఖాయం. ఏదో ఒకటి చేసి కొండల దగ్గరకు పోకుండానే తన సెక్యూరిటి స్టాఫ్‌ను తప్పించుకోవాలి. వేరే దారి లేదు.

రెండు క్షణాలు తీవ్రంగా ఆలోచించి మళ్ళీ పరుగు ప్రారంభించాడు షాడో. వెనుకనుంచి వినవస్తున్న అరుపుల్ని గురించి పట్టించుకోకుండా పొదల మధ్య నుంచి సూటిగా పర్వతాలవైపు దారి తీశాడు.

ఒక గంట తరువాత పెద్ద పల్లపు ప్రదేశంలో అతనికి కన్పించింది పెద్ద పశువుల మంద. నలుగురే నలుగురు కుర్రాళ్ళు వాటికి కాపలా నిలబడివున్నారు. వెదురు కర్రతో చేయబడిన వాయిద్యాన్ని ఇష్టం వచ్చినట్లు వాయిస్తూ ఆశ్చర్యంతో షాడో వంక చూశాడు వారిలో ఒకతను.

శరవేగంతో ఆలోచించి ఫాంటు జేబులో వున్న బోర్నియో కరెన్సీ నోట్లను రెండింటిని బయటకు తీశాడు షాడో.

"నన్ను పోలీసులు తరుముకు వస్తున్నారు. అన్యాయంగా జైల్లోపెట్టాలని వాళ్ళ ఉద్దేశ్యం... నన్ను కాపాడితే యీ నోట్లు మీకు యిచ్చేస్తాను." అన్నాడు వాటిని అతని కళ్ళముందు ఆడిస్తూ.

కుర్రాడి కళ్ళ ఆశతో మిలమిలా మెరిశాయి.

"ఏం చేయమంటావో చెప్పు... నువ్వు చెప్పినట్లే చేస్తాము... యింకో రెండు నోట్లు ఎక్కువగా యివ్వాలి..." అన్నాడు ఆ నోట్లను ఆత్రుతగా అందుకొని తన నిక్కర్ జేబులోపెట్టుకొంటూ.

రెండో ఆలోచన లేకుండా మరో రెండు నోట్లని అతని చేతికి అందించి పశువుల మంద మధ్యకు పరిగెత్తాడు షాడో. ఎయిర్‌బేగ్‌ని ఒక గుంటలోకి విసిరి, తను ధరించి వున్న ఫాంటు, షర్టులను తిరగేసి మళ్ళీ తొడుకున్నాడు.

అంతవరకు ఎంతో ఖరీదైనదుస్తుల మాదిరి కన్పిస్తున్న ఆ బట్టలు తిరగేసి తొడుక్కునేసరికి చినుగుల పుట్టలైనాయి. ఎంతో కాలంనుంచి విడవకుండా తొడుగుతున్నట్లు మరకలతో, మట్టితో అసహ్యకరంగా అగుపిస్తున్నాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=355**